

పుష్పగిరిలో వైభవోపేతంగా హరిహరుల రథోత్సవం

పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం హరి హరుల రథోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. - 8లో



అనంత, కడప జట్లు విజయం

కడప వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ-సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం, కడప జట్లు విజయం సాధించాయి. - 8లో



ఖాతాదారులకు సంతృప్తి కర సేవల్లో ముందంజ

తమ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

రేపు డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో డీఎస్సీ 1998లో ఎస్‌జీటీగా క్వాలిఫై అయి కాంట్రాక్టు పద్ధతిలో చేరేందుకు ఆసక్తి కనబరిచి విధుల్లో చేరకుండా మిగిలిపోయిన 5 పోస్టులకు ఈనెల 27వ తేదీన కడప డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఈనెల 12వ తేదీన నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జిల్లాలో 172 ఎస్‌జీటీ పోస్టులకు గాను 165 పోస్టులను భర్తీ చేశామన్నారు. మిగిలిన 5 పోస్టులకు మెరిట్ జాబితాలోని సీరియల్ నంబర్ 173 నుంచి 177 వరకు గల అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ఇందుకు సంబంధించిన జాబితా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేఏడీఏపీఏడీఈఓ.ఇన్‌లో పొందుపరిచామన్నారు. సంబంధిత అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో 27వ తేదీ ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని డీఈఓ పేర్కొన్నారు.

న్యాయశాస్త్ర పరీక్షలు తనిఖీ



న్యాయశాస్త్ర పరీక్షలను తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న లా సెమిస్టర్ పరీక్షలను పరీక్షల నియంత్రణాధికారి ఈశ్వరరెడ్డితో కలిసి రిజిస్ట్రార్ ఆచార్య వై.వెంకటసుబ్బయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

పీజీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 545 మంది విద్యార్థులు హాజరయ్యారు. 28వ తేదీ నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల సహాయ ప్రధాన పర్యవేక్షకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు.

ఇకపై పొదుపు లెక్కలు పక్కా



లోకోస్ యాప్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్

కడప రూరల్ : స్వయం సహాయక మహిళా సంఘాల పొదుపు లెక్కలు ఇకపై పక్కాగా ఉండాలన్న సంకల్పంతో లోకోస్ యాప్‌ను రూపొందించినట్లు డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో లోకోస్ యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకోస్ యాప్ ద్వారా పొదుపు సంఘాల సమగ్ర సమాచారం ఒకచోటే లభిస్తుందన్నారు. ఇది మే నెల నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా పొదుపు సంఘాల వివరాలన్నీ ఈ యాప్ ద్వారా ఒకే గొడుగు కిందికి వస్తాయన్నారు. ఆ మేరకు మండల, గ్రామ స్థాయిలో సంఘాల సహాయకులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

మారుతున్న కల్చర్!



- హార్టికల్చర్‌పై మక్కువ చూపుతున్న విద్యాధికులు
- మెట్ట ప్రాంతంలో సిరులు కురిపిస్తున్న పంటలు
- కడప గడపలో చేపల చెరువులు
- గణనీయంగా పెరిగిన ఉద్యాన పంటలు
- డ్రాగన్ ఫ్రూట్ సైతం పండిస్తున్న వైనం
- విదేశాలకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తులు

సాక్షి ప్రతినిధి, కడప: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అంటేనే ఫ్యాక్షన్ చరిత్రకు పర్యాయపదంగా చెప్పుకునేవారు అనేకమంది. కాలక్రమంలో ఫ్యాక్షన్ హత్యలు కనుమరుగయ్యాయి. హత్యలే కాదు, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపోయింది. 1990 దశకంలో 119 ఫ్యాక్షన్ గ్రామాలు జిల్లాలో ఉంటే, ప్రస్తుతం 60 గ్రామాల్లో మాత్రమే ఫ్యాక్షన్ వాసన అడపాదడపా కనిపిస్తోంది. 2022లో ఒక్క ఫ్యాక్షన్ హత్య కూడా జిల్లాలో నమోదు కాలేదన్న వాస్తవాన్ని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీనిని బట్టి ఫ్యాక్షన్ క్రమేపీ తెరమరుగవుతుందన్నది సుస్పష్టం. అందుకు ప్రధాన కారణం విద్యాధికులు పెరగడమే. పుష్కరకాలం క్రితం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రధాన తోడ్పాటుగా నిలిచింది. రైతు కుటుంబాల నుంచి వేలాది మంది విద్యావంతులయ్యారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో ఆర్థిక పరపతి పెరగడం, అయా కుటుంబీకులు పెట్టుబడికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా వాణిజ్య పంటల వైపు దృష్టి సారించారు. ప్రధానంగా హార్టికల్చర్ పంటల సాగు గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా ఆదాయం గడిస్తుండడంతో ఫ్యాక్షన్ మూలాలను వదిలేశారు. పైగా మెట్ట ప్రాంతానికి కృష్ణా జలాలు వచ్చి చేరడంతో జిల్లా 'కల్చర్' పూర్తిగా మారిపోయిందనడంలో సందేహం లేదు.

నాడు నెత్తుటి మరకలు.. నేడు పచ్చని పంటలు..

ఆడవిచెర్లోపల్లె ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామం. ఇప్పుడు ఆ గ్రామంలో విదేశాల్లో పండించే డ్రాగన్ ఫ్రూట్ పంటను యువరైతు గంగిరెడ్డి పండిస్తున్నాడు. తన సోదరుడు అన్వస్థతకు గురైతే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లిన గంగిరెడ్డికి డిశ్చార్జి సందర్భంగా డాక్టర్లు డ్రాగన్ ఫ్రూట్స్ వాడడం చాలా మంచిదని చెప్పారు. వారి సూచన మేరకు కొనుగోలు చేస్తే ఒక్కో డ్రాగన్ ఫ్రూట్ ధర రూ.150 పలికింది. ఆ పండు ధర గంగిరెడ్డి మదిలో పడింది. పంట సాగుపై అధ్యయనం చేశాడు. ఎలాంటి రకం



అడివి చెర్లోపల్లెలో సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్ పంట

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో సాగులో ఉన్న ఉద్యాన పంటల వివరాలు (హెక్టార్లలో)

ప్రధానంగా సాగులో ఉన్న పండ్ల తోటలు: 58,164	అరటిపంట: 8,398	పులుసునిమ్మ: 1,847	బొప్పాయి: 1,489	సపోటా: 323
	మామిడి: 4,226	చీనీ పంట: 25,633	దానిమ్మ: 790	డ్రాగన్ ఫ్రూట్: 65

పెడితే మన ప్రాంతంలో దిగుబడి సాధించవచ్చో తెలుసుకున్నాడు. తమిళనాడు నుంచి మొక్కలు తెప్పించి సక్సెస్‌ఫుల్‌గా దిగుబడి సాధిస్తున్నాడు. ప్రస్తుతం టన్ను రూ.1.5 లక్షలు ధర పలుకుతుండగా, ఎకరాకు 7 టన్నులు తక్కువ లేకుండా దిగుబడి సాధిస్తున్నాడు. ఫ్యాక్షన్ గ్రామంలో ఆదర్శ రైతుగా గంగిరెడ్డి నిలుస్తున్నాడు. ఈ విధంగా యువకులు, విద్యాధికులు హార్టికల్చర్ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

పులివెందుల అరటి.. విదేశాలకు ఎగుమతి..

పులివెందుల ప్రాంతంలో పండించే అరటి పంట మంచి నాణ్యత కలిగి ఉంటోంది. అరటి రైతులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రతి రోజు కొన్ని వందల టన్నులు తరలివెళ్తోంది. ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాలలో మంచి డిమాండ్ ఉంటోంది. ప్రతి ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రైతులు వారు పండించిన పంటలను విదేశాలకు ఎగుమతి చేస్తారు. మన దేశంలో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర, హైదరాబాద్ ప్రాంతాలకు పులివెందుల ప్రాంత అరటి వెళ్తోంది. ఈ ప్రాంత అరటికి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు దక్కింది. సాధారణంగా అరటి పండ్లు ఏడు రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. ఇక్కడి అరటి పండ్లు 14రోజుల వరకు నిల్వ ఉంటాయని రైతులు వివరిస్తున్నారు.

కృష్ణాజలాల రాకతో..

'మెట్ట ప్రాంతంలో కృష్ణాజలాలు పారించిన రోజునా జన్మ ధన్యం' అని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజోలి రిజర్వాయర్ శంకుస్థాపన సందర్భంగా ప్రకటించారు. వాస్తవంగా కృష్ణా జలాలు రాయలసీమకు రావడంతో సీమ ప్రజల తలరాత మారుతోంది. ఎప్పుడూ కరువు విలయతాండవం చేసే అనంతపురం జిల్లా పంటలతో కళకళలాడుతోంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో గండికోట, వామికొండ, సర్వరాయసాగర్, బ్రహ్మంసాగర్‌లో నీరు పుష్కలంగా ఉంది. కృష్ణా జలాల కారణంగా ఆక్వా ఉత్పత్తుల పట్ల సైతం జిల్లా వాసులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా ఎన్నడూ లేని విధంగా చేపల పెంపకంపై దృష్టి సారించారు. చాపాడు, వీరపునాయునిపల్లె, కొండాపురం, ముద్దనూరు, బి.మఠం, బి.కోడూరు మండలాల పరిధిలో చేపల పెంపకం సాగిస్తున్నారు. క్రమేపీ ఈ రంగంలోనూ రైతులు పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధులయ్యారు. ఎప్పుడూ రక్తచరిత్ర పేరుతో బురద చల్లే సినీ ప్రముఖులకు కూడా జిల్లా వాసులు సవాల్ విసురుతున్నారు. మా కల్చర్ మారిందని నిరూపిస్తున్నారు.



ఈ ఫొటోలో ఉన్న యువ రైతు పేరు మూలి గంగిరెడ్డి. వీరపునాయునిపల్లె మండలం అడవిచెర్లోపల్లి గ్రామం. ఇతర దేశాల్లో పండించే డ్రాగన్ ఫ్రూట్ పంటపై దృష్టి పెట్టాడు. ఎకరాకు రూ.4లక్షలు పెట్టుబడి పెట్టించి, 4 ఎకరాల్లో పంట సాగు చేశాడు. రాయలసీమ ప్రాంతానికి అనువైన తైవాన్ పింక్ రకం వేస్తే ఇక్కడి వాతావరణానికి తట్టుకోగలదని తెలుసుకొని తమిళనాడు నుంచి మొక్కలు తెచ్చుకున్నాడు. పట్టువదలని గంగిరెడ్డి డ్రాగన్ ఫ్రూట్ పంట దిగుబడిలో సక్సెస్ అయ్యాడు. దిగుబడికి తగ్గట్టుగా ధర ఎప్పటికీ తగ్గకుండా ఉండడంతో గణనీయంగా ఆదాయం గడిస్తున్నాడు. ప్రస్తుతం ఆసక్తి ఉన్న రైతులకు ఆయనే అంట్లు కట్టి మొక్కలను అందిస్తున్నాడు.



ఈ రైతు పేరు జి.పవన్‌కుమార్‌రెడ్డి. ఎంబీఏ చదివాడు. అమెరికాలో వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగించేవాడు. స్వగ్రామం అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం యనమవాండ్లపల్లె. అమెరికాలో ఎంత సంపాదిస్తున్నా తృప్తి లేదు. రైతు కుటుంబంలో పుట్టిన ఆయనకు మట్టి వాసనపై మమకారం పోలేదు. వ్యవసాయంపై మక్కువతో అమెరికా నుంచి వచ్చి సంబేపల్లె మండలంలోని దేవపట్లకు చెందిన తన బావ అవుల హర్షవర్ధన్‌రెడ్డి పొలంలో 30 ఎకరాలు బొప్పాయి పంటసాగు చేశాడు. నాణ్యమైన పంట కోసం మహారాష్ట్ర నుంచి 786 రకం బొప్పాయి నారు తెప్పించాడు. ఒక కోతకు 60 టన్నులు పంట దిగుబడి రానున్నట్లు అంచనా వేస్తున్నాడు. ఒకసారి పంట సాగుచేస్తే 10 నుంచి 15 కోతలు రానున్నాయి. పంటల సాగులో ఆదర్శంగా నిలుస్తుండటంతో మండల రైతులు శభాష్ అంటున్నారు.

పేదల చదువుకు పట్టం

- జిల్లాలో 46,714 మంది అర్హులైన విద్యార్థులు
- తల్లుల ఖాతాకు రూ. 4480.47 లక్షలు జమ
- నేడు జగనన్న వసతి దీవెన కింద నిధులు మంజూరు

కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా వేలాది మంది నిరుపేదలైన ఎస్సీ ఎస్టీ బీసీ ఈబీసీ కాపు ముస్లిం క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. నిశ్చింతగా చదువుకుంటూ తమ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

ఠంచనుగా ఫీజులు

ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ద్వారా ఏడాదికి నాలుగు విడతలుగా విద్యార్థుల తరుపున కళాశాల ఫీజులను ఠంచనుగా చెల్లిస్తోంది. ఈ నిధులను తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. తల్లులు ఆయా కళాశాలలకు వెళ్లి ఫీజులను చెల్లిస్తున్నారు. తమ పిల్లల బాగోగులను, విద్యను ప్రత్యక్షంగా తిలకిస్తున్నారు.

ప్రోత్సాహకంగా వసతి దీవెన

డే స్కాలర్స్ విద్యార్థులకు అంటే ఇంటర్మీడియేట్ విద్యార్థులకు అమ్మ ఒడి వర్తిస్తుంది. ఐటీఐ, పాలిటెక్నిక్, ఆపై డిగ్రీ, మెడిసిన్, ఇంజినీరింగ్ తదితర ఉన్నత విద్యను అభ్యసించే (డే స్కాలర్స్) విద్యార్థులకు జగనన్న వసతి దీవెన ద్వారా తల్లుల ఖాతాలకు ప్రభుత్వం నిధులను జమ చేస్తోంది. ఏడాదికి ఐటీఐ చదివే విద్యార్థులకు రూ. 10 వేలు, పాలిటెక్నిక్ వారికి రూ.15 వేలు, డిగ్రీ, ఆపై చదివే వారికి రూ. 20 వేలు చొప్పున ఏడాదిలో రెండు దఫాలుగా ప్రభుత్వం చెల్లిస్తోంది.

వైఎస్సార్ జిల్లాలో జగనన్న వసతి దీవెనకు పథకం వివరాలు (2022-23 మొదటి విడత నిధులు)

కేటగిరి	విద్యార్థులు	నిధులు మంజూరు (రూ.లక్షల్లో)
ఎస్సీ	8149	774.10
ఎస్టీ	736	69.45
బీసీ	17,231	1645.12
ఈబీసీ	9022	880.55
కాపు	5875	563.51
ముస్లిం	5579	535.77
క్రిస్టియన్	122	11.97
మొత్తం	46,714	4480.47

బృహత్తర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమం కోసం జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకాలు పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతున్నాయి. తద్వారా ప్రతియేటా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి ప్రయోజకులుగా మారుతున్నారు. ఈ బృహత్తర పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – జయప్రకాశ్, జాయింట్ డైరెక్టర్; జిల్లా సాంఘిక సంక్షేమశాఖ

గవర్నర్ జిల్లా పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- 28న ఒంటిమిట్ట ఆలయం, కడప పెద్దదర్గా సందర్శన
- జేసీ గణేష్ కుమార్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 28వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్నారని, అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఆయన పర్యటన విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఏఎస్పీ తూషార్ డూడి, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి అధికారులతో మాట్లాడారు. గవర్నర్ ఈనెల 28వ తేదీ ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం, కడప పెద్దదర్గాను దర్శించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, డీఎస్పీ వెంకట శివారెడ్డి పాల్గొన్నారు.

పర్యటన ఇలా

రాష్ట్ర గవర్నర్ శుక్రవారం ఉదయం 7.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 9.10 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుపతి చేరుకుని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి బయలుదేరి 3.00 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి రోడ్డు మార్గాన ఒంటిమిట్టకు బయలుదేరి వెళతారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి దర్శనం అనంతరం సాయంత్రం 5 గంటలకు కడప పెద్దదర్గాకు వస్తారు. దర్గాలో దర్శనం అనంతరం సాయంత్రం 5.45 గంటలకు కడప విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో తిరుపతికి బయలుదేరి వెళతారు.

నాడు-నేడు పనుల్లో జాప్యం తగదు

మన బడి నాడు-నేడు పనుల నిర్వహణలో జాప్యం ఉండరాదని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫేస్-2 పనుల పురోగతిపై విద్యాశాఖ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు.

పెరిగిన గౌరవం

- పది పరీక్షల నిర్వహణతోపాటు మూల్యాంకనానికి పారితోషికం పెంపు
- విద్యార్థుల చదువు, ఉపాధ్యాయుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి
- ఏడేళ్ల తరువాత సిబ్బందికి పెరిగిన రెమ్యూనరేషన్
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోంది. ఇప్పటికే నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చింది. అలాగే విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోజుకో మెనూను అమలు చేస్తోంది. తాజాగా ఉపాధ్యాయుల మేలు కోరుతూ పది పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించిన రెమ్యూనరేషన్ పెంచి వారి మదిలో ఆనందం నింపింది. పది పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం వరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తారు. ఈ విధులు నిర్వహించినందుకు ప్రభుత్వం వారికి తగిన పారితోషికం ఇస్తుంది. ఈ పారితోషికాన్ని



మూల్యాంకన విధుల్లో సిబ్బంది(ఫైల్)

2016 నుంచి ఒకేలా ఇస్తున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రెమ్యూనరేషన్‌ను పెంచాలని పలు సార్లు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం జీఓ నంబర్ 37ను విడుదల చేస్తూ పదో తరగతి పరీక్షలు, జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బంది, అధికారులకు రెమ్యూనరేషన్ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పది పరీక్షల నిర్వహణలో...

పది పరీక్షల నిర్వహణలో పేపర్ సెట్టర్, సీఎస్, డీఓలు, ఇన్విజిలేటర్లు, క్లర్కు, అటెండర్స్, వాటర్‌మెన్, సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్, ట్రాన్స్‌లేటర్, మోడరేటర్, వైద్య సిబ్బంది జిల్లాస్థాయి పరిశీలకులు పాల్గొంటారు. జిల్లాలో ఇటీవల ముగిసిన పది పరీక్షల విధుల్లో 146 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 146 మంది డిపార్టుమెంట్ అధికారులు, 1437 మంది ఇన్విజిలేటర్లు, 146 మంది సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు, 7 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల్లో...

ఈ 19వ తేదీ నుంచి ప్రారంభమైన మూల్యాంకన విధుల్లో 209 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 627 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 209 మంది స్పెషల్ అసిస్టెంట్లు ఇలా మొత్తంగా 1045 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణ సిబ్బందికి పెరిగిన పారితోషికం ఇలా..

కేటగిరి	నాడు (రూ. రోజుకు)	నేడు (రూ.రోజుకు)
పేపర్ సెట్టర్(ప్రతిపేపరుకు)	రూ.880	రూ.1,320
ట్రాన్స్‌లేటర్ (ప్రతిపేపరుకు)	రూ.770	రూ.1,155
మోడరేటర్(ప్రతి పేపరుకు)	రూ.770	రూ.1,155
చీఫ్ సూపరింటెండెంట్	రూ.44	రూ.66
డీఓ, ఏడీఓ	రూ.44	రూ.66
ఇన్విజిలేటర్	రూ.22	రూ.33
క్లర్క్	రూ.22	రూ.33
అటెండర్	రూ.13.20	రూ.20
వాటర్‌మెన్	రూ.11	రూ.17
సిట్టింగ్ స్క్వాడ్	రూ.44	రూ.66
వైద్య సిబ్బంది	రూ.22	రూ.33
జిల్లా స్థాయి పరిశీలకులు	రూ.200	రూ.300
మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి పెరిగిన పారితోషికం ఇలా..		
క్యాంప్ ఆఫీసర్	రూ.385	రూ.578
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు	రూ.330	రూ.495
అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు	రూ.286	రూ.429
చీఫ్ ఎగ్జామినర్ (రోజుకు)	రూ.264	రూ.396
ఏఈలు(ప్రతి పేపరుకు)	రూ.6.60	రూ.10
స్పెషల్ అసిస్టెంట్లు	రూ.137.50	రూ.300
క్లరికల్ అసిస్టెంట్లు	రూ.88	రూ.132
ఆఫీస్ సబార్డినేట్స్	రూ.55	రూ.83
చీఫ్ కోడింగ్ ఆఫీసర్	రూ.220	రూ.330
సహాయ కోడింగ్ ఆఫీసర్	రూ.198	రూ.297
ప్రిన్సిపల్స్ ఆఫ్ వ్యాల్యుయేషన్	రూ.250	రూ.375

పెరిగిన ధరలకు అనుగుణంగా..



రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా మూల్యాంకనం, పరీక్ష విధుల్లో పాల్గొన్న సిబ్బందికి రెమ్యూనరేషన్ పెంచడం అభినందనీయం. గత ఏడేళ్ల నుంచి పాత రెమ్యూనరేషన్‌కే సిబ్బంది పనిచేశారు. వీరి కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం రెమ్యూనరేషన్ పెంచింది. దీంతో ఉపాధ్యాయులు చాలా సంతోషంగా ఉన్నారు. – సజ్జల వెంకట రమణారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్, రాష్ట్ర నాయకుడు

సమస్యల పట్ల సానుకూలంగా..



రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తోంది. ఇందుకు నిదర్శనం ప్రస్తుతం పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధుల్లో పాల్గొన్న సిబ్బందికి పారితోషికం పెంచడమే. అలాగే ఇతర సమస్యల గురించి కూడా ప్రభుత్వం స్పందించి పరిష్కరిస్తే చాలా సంతోషంగా ఉంటుంది. – లెక్కల జమాల్‌రెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

ఈ ఏడాది నుంచే..



ప్రభుత్వం పెంచిన పారితోషికాన్ని ఈ ఏడాది నుంచి అమలు చేస్తాం. పది పరీక్షల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న మూల్యాంకన విధుల్లో కూడా సిబ్బంది చాలా బాగా పనిచేస్తున్నారు. వీరి కష్టాన్ని గమనించిన ప్రభుత్వం వారి పారితోషికాన్ని పెంచడం సంతోషం. – ఎద్దుల రాఘవరెడ్డి, పది మూల్యాంకన క్యాంపు ఆఫీసర్, డీఈఓ

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : 2010 నుంచి 2016 ఏప్రిల్‌లోపు ఆధార్‌చేయించుకున్న వాళ్లంతా తమ ఆధార్ ప్రూఫ్, అడ్రస్ ప్రూఫ్ తీసుకుని దగ్గరలోని ఆధార్ సెంటర్‌కు వెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సెంటర్‌కు తమ వద్ద ఉన్న ఒరిజినల్ ఆధార్ తీసుకుని వెళ్లాలన్నారు. అప్‌డేట్ చేయించుకోకపోతే ఆధార్ డీ యాక్టివేట్ అవుతుందన్నారు. ఆధార్ అప్‌డేషన్ కోసం ఈనెల 26, 27 తేదీల్లో ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

న్యాయమూర్తులకు సన్మానం


న్యాయమూర్తి మోతీలాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కడప అర్బన్ : కడపలోని జిల్లా కోర్టులో న్యాయమూర్తులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న వారికి కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి హేమలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రియాజ్ అహ్మద్‌లను ఘనంగా సన్మానించారు. వారు జిల్లా కోర్టులో పనిచేసిన తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీఎస్ మూర్తి, నాలుగవ అదనపు జిల్లా జడ్జి గీత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కవిత, అడిషనల్ సీనియర్ జడ్జి ప్రదీప్‌కుమార్‌లు పాల్గొని న్యాయమూర్తులకు వీడ్కోలు సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.వి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి జాన్ కెనడి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రూ.50 వేలు విలువైన మందుల పెట్టె అప్పగింత


మందుల పెట్టెను బాధితునికి అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

మైదుకూరు : తెలంగాణకు చెందిన శశికుమార్ అనే ప్రయాణికుడు బస్సులో మర్చిపోయిన రూ.50వేలు విలువ చేసే మందుల పెట్టెను, సెల్ ఫోన్‌ను మంగళవారం మైదుకూరు ఆర్టీసీ డిపో అధికారులు ఆయనకు అప్పగించారు. సింగరేణి మండలం మేకల తాండకు చెందిన శశికుమార్ కర్నూలులో మైదుకూరు డిపోకు చెందిన కడప సర్వీసు బస్సు ఎక్కారు. ఆయన పొరపాటున ఆళ్లగడ్డలోనే దిగారు. తరువాత సమాచారం ఇవ్వడంతో మైదుకూరు డిపో అధికారులు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. సూపరింటెండెంట్ మంజుల, జనరల్ ఏడీసీ లక్షుమయ్య, సెక్యూరిటీ అధికారులు పుల్లయ్య, విజయ బాధితునికి మందుల పెట్టె, సెల్‌ఫోన్, దుస్తుల బ్యాగు అందజేశారు.

వైభవోపేతంగా హరిహరుల రథోత్సవం


వైద్యనాథుని రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) కొలువుదీరిన కామాక్షి, వైద్యనాథేశ్వరుడు


శ్రీ లక్ష్మీ చెన్నకేశవుని రథోత్సవంలో భక్తులు (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవిలతో చెన్నకేశవుడు

వల్లూరు : పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం హరి హరుల రథోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఉదయం శ్రీ వైద్యనాథేశ్వర స్వామి రథోత్సవం జరిగింది. శ్రీ కామాక్షీ సమేతుడైన వైద్యనాథ స్వామి రథంలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పూజలను నిర్వహించారు. భక్తులు శివ నామాన్ని స్మరిస్తూ పోటీలు పడి రథాన్ని లాగారు. కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సాయంత్రం శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి రథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుండి గ్రామోత్సవాలలో వివిధ వాహనాలపై ఒంటరిగా దర్శనమిచ్చిన చెన్న కేశవుడు కళ్యాణ మహోత్సవంతో పరిపూర్ణుడై శ్రీదేవి ,భూదేవిలతో కలిసి రథంపై ఆశీనుల య్యారు. బంగారు ఆభరణాలతో అలంకార భూషితులైన స్వామివారు ఇరువురు దేవేరులతో కలిసి దర్శనమివ్వడంతో సాక్షాత్తు వైకుంఠంలోని శ్రీహరి అంశకు చెందిన శ్రీ వెంకటేశ్వరున్ని దర్శించుకున్నట్లుగా భక్తులు పులకించిపోయారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో రథం వద్ద పూజలు చేశారు. అనంతరం విశ్వక్సేన ఆరాధనం ,పుణ్యాహవచనం ,రథ సంప్రోక్షణ, అభిషేకాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు నదిలో స్నానం చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సత్య బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ విష్ణు వర్ధన్ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు డా ఫణీంద్ర ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అన్నదానం..

రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్య వైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. కాగా శ్రీ చెన్న కేశవ ఆలయంలో అరవ చెన్నారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. రథాల వద్ద జరిగిన పూజా కార్యక్రమాలలో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి, ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, తహశీల్దార్ అమరేశ్వరి, ఉభయదారులు కారంశెట్టి బాలయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు

పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. రాత్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి అశ్వ వాహనంపై దర్శనమివ్వనున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని విద్యానగర్‌లో మంగళవారం విద్యుత్ షాక్ తో ఓ వ్యక్తి మృతిచెందాడు. అట్లూరు మండలం రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన పల్లెగోపయ్య (48) అనే వ్యక్తి 16 ఏళ్ల కిందట బద్వేలుకు వచ్చి విద్యానగర్‌లో నివసిస్తుండేవాడు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే సాయంత్రం సమయంలో ఇంటి మిద్దె పైన ఉండగా విద్యుత్ తీగ తెగి గోపయ్య మీద పడటంతో విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం



కడప అర్బన్ : ఈనెల 20వ తేదీన ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అనారోగ్యంతో బాధపడుతుండగా శ్రీరామక్క (65) అనే వృద్ధురాలిని కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు తీసుకుని వచ్చారు. ఈనెల 24వ తేదీన సాయంత్రం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

ఖాతాదారులకు సంతృప్తికర సేవల్లో ముందంజ

- నికరలాభం రూ. 595.15 కోట్లు
- నికర విలువ రూ. 3,789.26 కోట్లు
- వ్యాపారంలో 6.11 శాతం వృద్ధి రేటు
- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప సెవెన్‌రోడ్స్ : ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంలో ఇతర బ్యాంకులకు ఏమాత్రం తీసిపోని రీతిలో తమ బ్యాంకు ముందు వరుసలో ఉందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. 2022–23 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. తమ బ్యాంకు రూ. 41,656 కోట్ల వ్యాపారంతో గడిచిన సంవత్సర కాలంలో రూ. 595.15 కోట్ల నికర లాభాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ. 2398.42 కోట్లు అదనపు వ్యాపారాన్ని నిర్వహించి 6.11 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకున్నామన్నారు. తమ బ్యాంకు రూ. 3789.26 కోట్ల నికర విలువ కలిగి దేశంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా నిలవడం తమకు గర్వకారణమన్నారు. ఖాతాదారులకు ఇంటి వద్దే బ్యాంకు సేవలు అందిస్తున్నామని, 98 ఏటీఎంలు ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు ఖాతాదారులు మార్చి 31 నాటికి 57.73 లక్షల మంది కాగా, డిపాజిటర్లు 67.64 లక్షల మంది, రుణగ్రహీతలు 16.10 లక్షల మంది ఉన్నారని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు అందించిన రుణాల స్థాయి రూ. 19,923 కోట్లకు చేరగా, అది మొత్తం రుణాలలో 91.12 శాతం ఉండడం తమ బ్యాంకు ప్రత్యేకతగా చెప్పారు. వ్యవసాయ రంగానికి ఇచ్చిన రుణాల స్థాయి రూ. 16,899 కోట్లకు చేరగా ఇది మొత్తం రుణాల్లో 77.29 శాతం ఉందన్నారు.

ఈ ఏడు లక్ష్యాలు

2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యాపార లక్ష్యాన్ని రూ. 45,500 కోట్లుగా నిర్దేశించుకున్నామన్నారు. మొత్తం డిపాజిట్లలో 38 శాతం కాసా డిపాజిట్లను సేకరిస్తామన్నారు. చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించడం, పీఎంజేడీవై ఖాతాల్లో లావాదేవీలు నిర్వహించేలా అవగాహన పెంపొందించడం, రికరింగ్ డిపాజిట్లు, రీటైల్ టర్మ్ డిపాజిట్లను విరివిగా ప్రారంభిస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు, ఎంఎస్ఎంఈ రంగాలకు, గృహ నిర్మాణం, కొనుగోళ్లకు రుణ సదుపాయాలు విస్తృతంగా అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు జీఎంలు జగదీశ్వర్‌రావు, కె.విజయభాస్కర్, పీఆర్ పడగొటువార్, ఆర్.గిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన బాలుడు


- పది రోజుల పాటు చికిత్స పొందుతూ మృతిచెందిన బాలుడు
- రామాపురం రోడ్డు ప్రమాద ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య


హర్షవర్ధన్ (ఫైల్)

బద్వేలు అర్బన్ : ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ కొత్తపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న పెనుమాల హర్షవర్ధన్ (14) సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పట్టణంలోని మార్తోమానగర్‌కు చెందిన నరసయ్య, అన్నపూర్ణమ్మలకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్నవాడైన హర్షవర్ధన్ నెల్లూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతుండేవాడు. నానమ్మ అయిన లక్షుమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈ నెల 15న పాఠశాలకు సెలవు పెట్టి చూసేందుకు బద్వేలుకు వచ్చాడు. అదే రోజు రాత్రి చికిత్స కోసం వెళుతున్న నాన్నమ్మ, నాన్నతో కలిసి హర్షవర్ధన్ కూడా విరూపాక్షపురానికి కారులో బయలుదేరాడు. రామాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హర్షవర్ధన్ తండ్రి నరసయ్య, నాన్నమ్మ లక్షుమ్మ, మరో నాన్నమ్మ చిన్నక్కతో పాటు కారు యజమాని రాజమోహన్‌రెడ్డిలు మృతిచెందగా హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించి చికిత్స ప్రారంభించారు. పరిస్థితి విషమంగానే ఉండటంతో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో, వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో, తిరుపతి స్విమ్స్‌లో, నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో తిరిగి సోమవారం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. దీంతో మృతుల సంఖ్య 5కు చేరుకోగా నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. ప్రమాద ఘటనలో భర్తను కోల్పోయిన అన్నపూర్ణమ్మ పది రోజుల తర్వాత కుమారుడిని కూడా పోగొట్టుకోవడంతో గుండెలవిసేలా రోదిస్తోంది. దీంతో మార్తోమానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాడీ బిల్డర్.. అయ్యాడు చైన్‌స్నాచర్

- విలాసాల కోసం చోరీలు
- బెంగళూరులో కడపవాసి అరెస్టు


బాడీబిల్డర్ సయ్యద్ బాషా, అనుచరుడు అయూబ్

బనశంకరి : బాడీ బిల్డింగ్ పోటీల్లో పేరు గడించిన కడప రవీంద్రనగర నివాసి సయ్యద్ బాషా (34), అతని అనుచరుడు షేక్ అయూబ్ ను మంగళవారం బెంగళూరు దక్షిణ విభాగం గిరినగర పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడి వద్ద నుంచి రూ.6 లక్షల విలువచేసే బంగారు చైన్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ కృష్ణకాంత్ వివరాలను వెల్లడించారు. సయ్యద్ పాషా 2005 నుంచి 2015 వరకు కువైట్‌లో కారు డ్రైవరుగా పనిచేశాడు. అక్కడ ఉండగానే బంగారం స్మగ్లింగ్‌లో పాల్గొన్నాడు. కరోనా సమయంలో సొంతూరికి చేరుకుని బాడీ బిల్డర్‌గా రాణించి పోటీల్లో పాల్గొని మిస్టర్ ఆంధ్ర గా గుర్తింపు పొందాడు. సులభంగా డబ్బు సంపాదించాలని అడ్డదారులు తొక్కడం మొదలుపెట్టాడు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడడంతో స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.

బెంగళూరులో చోరీలు సులభమని..

సయ్యద్ జైలులో ఉండగా బెంగళూరులో సులభంగా దొంగతనాలు చేయవచ్చునని తోటి ఖైదీ సలహా ఇచ్చాడు. దీంతో సయ్యద్ కొంతకాలం కిందట బెయిల్ పై విడుదలై కడప నుంచి బెంగళూరు కు చేరుకున్నాడు. బైక్‌లను దొంగిలించి వాటిపై గిరినగర, సుబ్రమణ్యనగర పోలీస్‌స్టేషన్ల పరిధిలో తిరుగుతూ ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. చోరీ తరువాత కూడా అదే ప్రాంతంలో మామూలుగానే తిరిగేవాడు, దీని వల్ల తనపై ఎవరికీ అనుమానం రాదని భావించేవాడు. అంతేగాక మొబైల్‌ఫోన్ ను కూడా వాడేవాడు కాదు. గిరినగరలో నమోదైన చైన్‌స్నాచింగ్ కేసుల్లో దర్యాప్తు చేసి సీసీ కెమెరాల చిత్రాల ఆధారంగా బైక్ నంబరును గుర్తించారు. మంగళవారం ఇద్దరిని అరెస్ట్‌చేసి విచారణ చేపట్టారు. నగరంలో చైన్‌స్నాచింగ్‌లతో పాటు 32 దొంగతనాలతో సయ్యద్, అనుచరుని పాత్ర ఉన్నట్లు తెలిసింది.

అప్పుల బాధతో పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని శాస్త్రినగర్‌లో నివాసం ఉంటున్న వంగల దస్తగిరిరెడ్డి (59) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. దస్తగిరిరెడ్డి కడపలోని పోస్టల్‌శాఖలో ఎస్ఆర్ఓగా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరు డాక్టర్‌గా పని చేస్తుండగా మరో కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. దస్తగిరిరెడ్డి ఉద్యోగం చేస్తూనే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంతో అప్పులయ్యాయి. అప్పుల కారణంగా అతను ఇబ్బందులు పడేవాడు. ఈ క్రమంలో సోమవారం దస్తగిరిరెడ్డికి కోర్టు నుంచి నోటీసులు వచ్చాయి. నోటీసులు చూసిన కొద్ది సేపటి తర్వాత అతను ఉరేసుకున్నాడు. ఇంట్లోని కుటుంబ సభ్యులు సొంత పని మీద కర్నూలుకు వెళ్లడంతో దస్తగిరిరెడ్డి ఒంటరిగా ఉన్నారు. రాత్రి కుటుంబ సభ్యులు వచ్చి చూసుకోగా దస్తగిరిరెడ్డి ఉరేసుకొని మృతి చెందాడు. త్రీ టౌన్ ఎస్ఐ కృష్ణంరాజునాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కుమారుడు డాక్టర్ లక్ష్మిమురళీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మినీ లారీ ఢీకొని బేల్దారి దుర్మరణం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని కడప రోడ్డులో రోడ్డు దాటుతుండగా మినీ లారీ ఢీకొనడం వల్ల బీ.జగన్‌మోహన్‌రెడ్డి (62) అనే బేల్దారి దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల ఎస్ఐ వెంకట క్రిష్ణయ్య పరిశీలించి వివరాలను తెలియజేశారు. ఎర్రగుంట్ల పట్టణంలోని వినాయక నగర్ కాలనీలో నివాసం ఉంటున్న జగన్‌మోహన్‌రెడ్డి బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు సంతానం. మంగళవారం ఉదయం పని నిమిత్తం స్కూటర్‌పై మహేశ్వరనగర్ కాలనీలోకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సందర్భంగా రోడ్డు దాటుతుండగా మినీ లారీ వచ్చి ఢీకొంది. దీంతో జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

చక్రాయపేటలో 11 ఎంఎం వర్షం

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్ జిల్లాలోని చక్రాయపేటలో సోమవారం తెల్లవారుజామున 11 మిల్లీమీటర్ల వర్షం నమోదయిందని కేవీకే వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. అలాగే వీఎన్‌పల్లెలో 6 ఎంఎం, లింగాలలో 3.5, వేంపల్లిలో 2.4 ఎంఎం , సిద్దవటంలో 1.8 ఎంఎం వర్షం నమోదైందని తెలిపారు. అలాగే గరిష్టంగా గంటకు 28.8 కిలోమీటర్ల వేగంతో బద్వేల్ మండలం కొంగలవీడులో గాలి వీచిందని తెలిపారు. అలాగే పెద్దముడియం మండలం నెమళ్లదిన్నెలో 26.5 కిలోమీటర్లు, తొండూరు మండలం గోటూరులో 23.1, సికెదిన్నె మండలం మూలవంకలో 21.8, కమలాపురం లేటపల్లెలో 20.2. పులివెందుల మండలం పులివెందుల్లో 18.8, గోపవరం మండలం చెన్నవరంలో 18.1 కిలోమీటర్ల వేగంతో గాలివీచినట్లు కేవీకే వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు.

నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలోని నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95శాతం అమలు చేశారన్నారు. ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ ముఖ్యమంత్రి పాలనపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీ నాయకులు, ఎల్లో మీడియా నిత్యం ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తిరిగి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడం ఖాయమని ఆయన తెలిపారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న ఎంపీ పరిష్కారానికి అధికారులకు ఫోన్లు, లేఖల ద్వారా తెలియజేశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి

కడప అగ్రికల్చర్ : మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులకు వ్యవసాయ సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని ఆచార్య యన్‌జీరంగా విశ్వ విద్యాలయ విశ్రాంతి డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ గిడ్డారెడ్డి అన్నారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మంగళవారం ఆర్‌బీకే అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ అధికారులు, గ్రామ సహాయకులు వ్యవసాయసాగులో రైతులకు మంచి సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసచారి, శాస్త్రవేత్తలు సునిల్‌కుమార్, శ్రీవల్లి, జాన్సన్, భగవతి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

అనంత, కడప జట్లు విజయం


నరేన్‌రెడ్డి, కడప (79 పరుగులు) | జ్ఞానేశ్వర్, చిత్తూరు (90 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ–సౌత్‌జోన్ టీ–20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం , కడప జట్లు విజయం సాధించాయి. మంగళవారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జట్టులోని సి.ఆర్. జ్ఞానేశ్వర్ 90 పరుగులు, అభిషేక్‌రెడ్డి 59 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు షోయబ్‌ఖాన్ 1, దీపక్ 1, రాజుకుళ్లాయప్ప 1 వికెట్ చొప్పున తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 19 ఓవర్లలోనే 8 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని పి. అర్జున్ టెండూల్కర్ 50 పరుగులు చేశాడు. దీంతో అనంతపురం జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నెల్లూరుపై కడప జట్టు విజయం..

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. జట్టులోని సుబ్రమణ్యం 65 పరుగులు చేశాడు. కడప బౌలర్ ఎస్ఎండీ రఫీ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 18.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని డి. నరేన్‌రెడ్డి 79 పరుగులు, జి.వి.పవన్‌కుమార్‌రెడ్డి 58 పరుగులు చేశారు. దీంతో కడప జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.